# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 189 | గురువారం, 11 జూన్ 2026 | పేజీలు : 4




# దారితప్పిన దిక్సూచి

- పుస్తకాల కొనుగోలులో అక్రమాలు
- రూ.46.50 లక్షలు స్వాహా
- చర్యలకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన "దిక్సూచి" కెరీర్ మార్గదర్శక పుస్తకాల కొనుగోలు వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు జనగామ కలెక్టరేట్ పరిపాలనా అధికారి, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ (డీడీవో) వై.రవి కిరణ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం జనగామ కలెక్టర్ కార్యాలయం "దిక్సూచి" పేరుతో 15,000 కెరీర్ మార్గదర్శక పుస్తకాలను ఒక్కొక్కటి రూ.310 చొప్పున మొత్తం రూ.46.50 లక్షల వ్యయంతో ముద్రించేందుకు హనుమకొండకు చెందిన రిత్విక్ గ్రాఫిక్స్ సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. అప్పటి డీడీవోగా విధులు నిర్వహించిన తహసీల్దార్ శ్రీకాంత్ బిల్లును ప్రాసెస్ చేసి పంపించగా 2026 మార్చి 26న ఆర్టీజీఎస్ ద్వారా మొత్తం చెల్లింపు సంస్థ ఖాతాకు జరిగినట్లు పేర్కొన్నారు. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆడిట్ అధికారి నిర్వహించిన పరిశీలనలో పలు అవకతవకలు బయటపడ్డాయని ఫిర్యాదులో వివరించారు.

వాస్తవంగా అవసరం సుమారు 5,100 పుస్తకాలు మాత్రమే ఉండగా 15,000 పుస్తకాల ఆర్డర్ ఇవ్వడం, ఓపెన్ టెండర్ ప్రక్రియను పాటించకుండా కేవలం మూడు కోటేషన్ల ఆధారంగా కొనుగోలు చేయడం, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఇండెంట్ లేకపోవడం, పాఠశాల విద్య కమిషనర్ అనుమతి తీసుకోకపోవడం వంటి అంశాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే కొనుగోలు కమిటీ ద్వారా ధరల ధృవీకరణ జరగకపోవడం, వర్క్ ఆర్డర్, ఈఎండీ, నాణ్యత తనిఖీ పత్రాలు లేకపోవడం, బడ్జెట్ కేటాయింపు లేకుండానే వడ్డీ నిధుల నుంచి చెల్లింపులు జరపడం వంటి అంశాలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు.

## ఎలాంటి రికార్డులు లేకుండానే..

జిల్లా విద్యాశాఖాధికారి లిఖితపూర్వకంగా ఈ పుస్తకాలు జిల్లాకు ఎప్పుడూ సరఫరా కాలేదని ధృవీకరించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన గూడ్స్ రిసిప్ట్ నోట్, స్టాక్ రిజిస్టర్ నమోదు, పంపిణీ రికార్డులు, స్వీకరణ ధృవపత్రాలు ఏవీ లభించలేదని పేర్కొన్నారు. ఫలితంగా ప్రభుత్వానికి చెందిన రూ.46.50 లక్షల నిధులు వస్తువులు అందకుండానే చెల్లించబడినట్లు ప్రాథమికంగా తేలిందని ఫిర్యాదులో ఆరోపించారు. ఇక ఈ చెల్లింపుకు సంబంధించిన ఈమెయిల్ అలర్ట్‌లను కలెక్టర్ కార్యాలయం అధికారిక ఈ మెయిల్ ఖాతా నుంచి తొలగించినట్లు కూడా ఫిర్యాదులో ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు సమాచారం తెలియకుండా చేయడం, చెల్లింపులకు సంబంధించిన ఆధారాలను దాచిపెట్టడం, సంబంధిత వ్యక్తులను చట్టపరమైన చర్యల నుంచి తప్పించడమే ఈ చర్యల ఉద్దేశమని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. బ్యాంకు రికార్డులు, గూగుల్ లాగిన్ వివరాలు, ఐపీ అడ్రసులు, డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాల ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలు ప్రాథమిక స్థాయిలో ఉన్నవేనని, విచారణ అనంతరం పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

- ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా:** ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను సమర్థంగా నియంత్రించగలమని ఆపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కల్యాణ వేదికలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది లక్షా 73 వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, తెలంగాణలో గత ఏడాది 7 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు.

## హత్యల కంటే రోడ్డు ప్రమాదాలే ఎక్కువ..

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హత్యల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలను ప్రదర్శనకు ఉంచి ప్రమాదాల కారణాలపై అవగాహన కల్పించారు. జాగృతి కళాబృందం, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పోలీసు, ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేయగా, యువతకు హెల్మెట్లు, ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, ధార కవిత, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సత్యనారాయణతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం

- పచ్చదనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

4లో


wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way





# ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పూర్తి

- **పనులను అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలి**
- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఏడాదిలోపు నిర్మాణాన్ని పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు కానుకగా అందిస్తామని చెప్పారు. జఫర్‌గడ్ మండలం దుర్గ్యతండా సమీపంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీసి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాల్లో ఉన్న ప్రకృతి వనం, స్మశానవాటికకు ప్రత్యామ్నాయంగా గుర్తించిన స్థలాన్ని వెంటనే గ్రామపంచాయతీకి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని సూచించారు. కొందరు అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. పాఠశాల పరిసరాల్లో ఎలాంటి వివాదాలు, గొడవలకు తావు లేకుండా చూడాలని సూచించారు. ఈ పాఠశాలలో నాలుగు గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసి సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్య అందించనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక విద్యా భవనాలు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, ఉపాధ్యాయుల నివాస గృహాలు, క్రీడా మైదానాలతో అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ విద్యాసంస్థను బాలికలకు ప్రత్యేకంగా కేటాయిస్తున్నామని, వారి భద్రతతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మే 2027 నాటికి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## గీత కార్మికుల భద్రతకు సేఫ్టీ కిట్లు

ప్రమాదకరమైన వృత్తిలో ఉన్న గౌడ సోదరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శిక్షణ పొందిన కార్మికులు రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 678 మంది కల్లు గీత కార్మికులకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు పాల్గొన్నారు.



# కులవృత్తులపై నిర్లక్ష్యం తగదు

- **కుమ్మరుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవు**
- **తెలంగాణ కుమ్మరుల సంఘం హెచ్చరిక**

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ కుమ్మరుల (శాలివాహన) సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకారపు మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో కుమ్మరులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కులవృత్తిదారుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం శాలివాహన కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించలేదని, శాలివాహన భవనాల నిర్మాణం పేరుతో ప్రకటనలు చేసినప్పటికీ వాటిని పూర్తి చేయకుండా కుమ్మరులను నిరాశపరిచిందని ఆరోపించారు. కులవృత్తుల ఆధునికీకరణకు ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు చేపట్టలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా కులవృత్తుల కార్పొరేషన్లు నిధుల కొరతతో నిర్వీర్యమయ్యాయని, వృత్తిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందడం లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా సాంప్రదాయ వృత్తిదారులకు ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కుమ్మరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షుడు శేషు, లింగాల జనార్ధన్, అమరవాది సారంగపాణి, చెదరాజు వెంకటేశ్వర్లు, ఏనుగుతల యాదగిరి, బొడ్డుపల్లి ఏకాంబరం, సముద్రాల పరమేశ్వర్, కొన్నె సిద్ధులు, పైడిపాల రాజేశ్వర్, నిమ్మగడ్డ శ్రీను, సముద్రాల రాజకోటి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మైనారిటీ సెల్ బలోపేతానికి కృషి

- **అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం**
- **డీసీసీ ప్రెసిడెంట్ ధన్వంతి లక్ష్మీనారాయణనాయక్**

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మైనారిటీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకుల సమస్యలు, స్థానిక పరిస్థితులను తెలుసుకుని వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మైనారిటీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్ష పదవికి అర్హులైన నాయకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. ఆసక్తి ఉన్న వారు రెండు రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఇతర నాయకులు కూడా మైనారిటీ విభాగం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జమాల్ షరీఫ్, జాఫర్ షరీఫ్, అన్వర్, మున్నీ బేగం, అర్జుల సుధాకర్ రెడ్డి, చింతకింది మల్లేష్, ఇస్మాయిల్, తారీక్, మాజిద్ అప్సర్, అలీముద్దీన్, అజారుద్దీన్, ఖాదర్ షరీఫ్, గౌస్, షకీల్, అక్రమ్, కమలుద్దీన్, ఆసిఫ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్లకు సౌకర్యాలు కల్పించాలి

**మంత్రి పొంగులేటికి సీపీఎం వినతి**

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంలో మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ, మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు గత 13 ఏండ్లుగా ప్రభుత్వ సహకారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వందలాది మంది నష్టపోయారని ఆరోపించారు. ఇందిరమ్మ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేక నివాసం ఉండలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. వెంటనే ఇంటి నెంబర్లు కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ సమయంలో స్థలాలు కోల్పోయిన 72 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. పేదల సమస్యలను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్ల శేఖర్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సంచు విజేందర్, కౌన్సిలర్ బూడిద జ్యోతి, ధర్మబిక్షం, గుండు శశిరేఖ పాల్గొన్నారు.

# ఇంటింటికీ పథకాలు చేరవేసేందుకే 'సారథి'

■ **డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి**




**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ ఆధ్వర్యంలో సారధి యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు సోషల్ మీడియా ప్రచారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ యాప్ రూపొందించబడిందని ఆమె తెలిపారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడం ఈ యాప్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ విజయాలు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ వైఖరిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త డిజిటల్ యోధుడిగా మారి పార్టీ ప్రచారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్లు, సోషల్ మీడియా డిజైన్లు, ప్రచార సామగ్రి సులభంగా అందుబాటులో ఉండటంతో పార్టీ సందేశం వేగంగా ప్రజల్లోకి చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేముల సత్యనారాయణ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఉడత రవి, లోక్కుంట్ల ప్రవీణ్, బడికె ఇందిరా, వేముల మల్లేశం, అభిగౌడ్, జమాల్ షరీఫ్, అన్వర్, అర్జుల సుధాకర్ రెడ్డి, మిద్దెపాక భాస్కర్, చింతకింది మల్లేష్, బోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సర్కార్ బడుల్లోనే విద్యార్థి వికాసం

■ **ఆర్డీవో ఉమారాణి**

**నల్లబెల్లి, మన చౌరాస్తా :** నల్లబెల్లి మండలంలోని నాగరాజుపల్లి గ్రామసభలో నర్సంపేట ఆర్డీవో పోలం ఉమారాణి స్థానిక పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల కరపత్రాలను సర్పంచ్ ఎరుకల లలిత, ఉపసర్పంచ్ బైరి శోభనతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థుల సర్వతోముఖ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ప్రత్యేక అధికారి డాక్టర్ భూక్యా సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పంచాయతీ కార్యదర్శి డాక్టర్ విష్ణు, గ్రామ పంచాయతీ అధికారి నూనె ఉపేందర్, క్షేత్ర సహాయకుడు రఘున, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రాంమూర్తి, ఉపాధ్యాయుడు కునమల్ల రాజన్‌బాబు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోగస్ పెన్షన్ కార్డులను తొలగించాలి




**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుల అర్హతలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వికలాంగుల పెన్షన్ల విషయంలో సదరం (SADAREM) సర్టిఫికెట్లను గ్రామ స్థాయిలో మరోసారి పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేయాలని కోరారు. గత పది సంవత్సరాలుగా కొంతమంది దళారులు, మధ్యవర్తుల సహాయంతో నకిలీ పత్రాలు సమర్పించి, నిజంగా వికలాంగులు కాకపోయినా వికలాంగుల పెన్షన్లు పొందుతున్నారని ఆరోపించారు. కొందరు ప్రభావవంతుల సిఫార్సులతో సదరం సర్టిఫికెట్లు పొందడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. అసలైన అర్హులైన వృద్ధులు, వితంతువులు, వంద శాతం అంగవైకల్యం కలిగిన వికలాంగులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తుండగా, అనర్హులు పెన్షన్లు పొందడం వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల జిల్లా కలెక్టర్లు, మండల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడి సదరం సర్టిఫికెట్, ఇతర అర్హత పత్రాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వెరిఫికేషన్ అనంతరం బోగస్ కార్డులను వెంటనే రద్దు చేసి, నిజమైన అర్హులకు మాత్రమే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యం పేదలు, నిరుపేదలు, నిజమైన అర్హులకు చేరుకోవడమేనని, అందుకు పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# విద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

■ **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**పాలకుర్తి, మన చౌరాస్తా :** విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలో అదనపు వసతుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో అదనపు వసతుల కోసం రూ.38.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు.




# ఘనంగా మార్కెట్ చైర్మన్ బర్త్ డే

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆశీస్సులు తీసుకున్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చెంచారపు కరుణాకర్ రెడ్డి, వంగల మల్లారెడ్డి కళ్యాణి, లింగాల నర్సిరెడ్డి, నామాల శ్రీనివాస్, బోట్ల నర్సింగరావు, బానోత్ బన్సీ నాయక్, తుపాకుల రాములు, జక్కుల వేణుమాధవ్, సాదం మధుసూదన్ యాదవ్, శ్రీధర్ రెడ్డి తదితర నాయకులు, మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# తుగ్లక్ పాలనను తలపిస్తున్న రేవంత్ నిర్ణయాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రాష్ట్రంలో విద్యాశాఖ నిర్వహణ అధ్వానంగా మారిందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరిచే విధానాలను అవలంబించడం ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండల సురేందర్ విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని చెబుతూ, మరోవైపు రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలలను కుదించే ప్రయత్నాలు చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేల పాఠశాలలకు పరిమితం చేసే ప్రతిపాదన విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత, నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ-2009) స్ఫూర్తి ప్రకారం ప్రతి విద్యార్థికి అందుబాటులో విద్యా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాఠశాలల విలీనం లేదా కుదింపు వల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు పాఠశాల మానివేతలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ విద్యపై చేసే ఖర్చును వ్యయంగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే సామాన్య, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల కారణంగానే విద్యా కమిషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారని, ఈ ఒక్క ఘటనతోనే రేవంత్ సర్కారు పనితీరు ఎంత అధ్వానంగా ఉందో ప్రజలకు అర్థమవుతుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే చర్యలకు బదులుగా విద్యా ప్రమాణాలను పెంపొందించే విధానాలను అమలు చేయాలని కోరారు.

# వల్మీడీ ఆలయానికి అన్నప్రసాద పాత్రలు



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండలం వల్మీడీ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి హనుమకొండ కు చెందిన సిరివోలు వెంకటేశ్వరరావు, హైమావతి దంపతులు కుటుంబ సభ్యులు కలిసి అన్నప్రసాదానికీ సంబంధించిన వంట పాత్రలు అందజేశారు. రు.70 వేల విలువగల వంట పాత్రలను ఆలయానికి అందజేశారు ఈ కార్యక్రమంలో సందీప్, సింధూర, అగస్త్య, అద్వైత్, ఈవో లక్ష్మి ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ ఓం ప్రకాష్, ఆలయ అర్చకుడు సుందరాచార్యులు, సర్పంచ్ నీరటి లక్ష్మి చంద్రయ్య, సిబ్బంది మోకాటి కుమార్, భారత సోమల్లు, నాగమల్ల సోమన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## ఆపరేషన్స్ డీజీపీకి ఘన స్వాగతం



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా.. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన అపరేషన్స్ డీజీపీ అనిల్ కుమార్, వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్‌లకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం డీజీపీ అనిల్ కుమార్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

# గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం

**పచ్చదనం, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా... బచ్చన్న పేట మండలం రామ చంద్రపురం లోని రైతు వేదిక లో నిర్వహించిన గ్రామ సభ కి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిది గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఘన వ్యర్ధాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా చేపట్టల్సిన కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని.. బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదని, తగుల బెట్టకూడదన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగం గా చెత్త విభజన, పరిసరాల పరిశుభ్రత మీద ప్రజలకి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని... పైపులైన్లకు మరమ్మత్తులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. వర్షపు నీరు నిల్వ



ఉండకుండా చూడాలని, వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు ఫీవర్ సర్వే చేయాలనీ జ్వరం తో బాధ పడే వారిని గుర్తించి తగు వైద్యం అందించాలని,దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు స్ప్రే చేయాలనీ కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో ఇసుక, నీటి తదితర సమస్య లు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 18004256605కి ఫోన్ చేసి సమస్యలను అధికారుల దృష్టి కి తీసుకరావాలన్నారు. గ్రామానికి చెందిన బాలమణి అనే మహిళ తన భర్త సంవత్సరం క్రితం చనిపోయారని...తనకు పెన్షన్ ని మంజూరు చేయాలనీ తెలపగా ముందు NFBS పథకంలో భాగంగా వారం లోపల ఆర్థిక సహాయం అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకి సూచించారు. యుద్ధ ప్రాతిపదికన మండలం లో... NFBS పథకం ద్వారా అర్హులైన వారికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ త్వరగా జారీ చేసి ...ఆర్థిక సహాయం అందించాలన్నారు. ప్రతీ 15 రోజులకోసారి గ్రామ సభ ను నిర్వహించుకొని.. గ్రామ ప్రజల సమస్య లకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు పని చేయాలన్నారు. అనంతరం రామ చంద్రపురం మండల పరిషత్ ప్రైమరి స్కూల్ లో చేపెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణన్ని కలెక్టర్ పరిశీలించి టెండర్ ప్రక్రియ ని త్వరగా చేసి మూడు, నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి అయ్యేలా పర్యవేక్షణ చేయాలనీ, జడ్పీ సీఈఓ కి తెలిపారు. విద్యార్థుల నమోదు ను పెంచాలని..కావలిసిన మౌలిక సౌకర్యాలను తప్పకుండ సమకూరస్తామన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ రంగారావు, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**